# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com    E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్    శుక్రవారం 24-1-2020    RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20    ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433    సంపుటి :26    సంచిక: 153    పేజీలు:4    వెల: రూ.1/-


## నమ్మిన సిద్ధాంతం కోసం బాల్ ఠాక్రే రాజీపడలేదు-నివాళులర్పించిన అమిత్ షా

న్యూఢిల్లీ,జనవరి23(ఆర్ఎన్ఎ): నమ్ముకున్న సిద్ధాంతం, ఆదర్శాల కోసం శివసేన వ్యవస్థాపకులు బాల్ ఠాక్రే ఎక్కడా రాజీపడలేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కొనియాడారు. ఠాక్రే ఎంతో విజ్ఞతతో వ్యవహరించేవారన్నారు. గురువారం బాల్‌ఠాక్రే జయంతిని పురస్కరించుకొని ఆయనకు నివాళులర్పించారు. బీజేపీతో కొన్ని దశాబ్దాలుగా ఉన్న బంధాన్ని వీడి శివసేన గతేడాది నవంబర్‌లో తీవ్ర ఉత్కంఠ పరిణామాల మధ్య కాంగ్రెస్, ఎన్సీపీలతో కలిసి మహారాష్ట్రలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమిత్ షా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. బాల్‌ఠాక్రే తన ప్రసంగంతో ప్రజల్ని మంత్రముగ్ధుల్ని చేసేవారని గుర్తుచేసుకున్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం స్థిరంగా నిలబడేవారనీ.. ఎక్కడా రాజీపడలేదని గుర్తుచేశారు. బాల్‌ఠాక్రే జీవితం, ఆయన పాటించిన విలువలు తమకు నిరంతరం స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. అలాగే, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయనకూ అమిత్ షా నివాళులర్పించారు. నేతాజీ అజాద్ హింద్ ఫౌజ్ స్థాపించి.. భారతదేశ స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని గుర్తుచేసుకున్నారు. మాతృభూమి పట్ల నేతాజీకి ఉన్న అభిమానం, ప్రేమ మనకు స్ఫూర్తిదాయకమంటూ అమిత్ షా తన ట్విటర్‌లో రాశారు.

# తెలంగాణలో నెత్తురోడిన రోడ్లు

### వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతి
### గద్వాల జిల్లాలో ముగ్గురు...ములుగులో ఒకరు మృతి

హైదరాబాద్,జనవరి22(ఆర్ఎన్ఎ): తెలంగాణ జిల్లాలో రోడ్లు నెత్తురోడాయి. వేర్వేరు ప్రమాదాల్లో కనీసం నలుగురు మృత్యువాత పడగా పలువురు క్షతగాత్రులయ్యారు. గద్వాల జిల్లాలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు, ములుగు జిల్లా ప్రమాదంలో ఒకరు,నల్లగొండ జిల్లాలో జరిగిన మరో ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. గద్వాల జిల్లాలో ఆగి ఉన్న ఓ చెరుకు ట్రాక్టర్‌ను అతివేగంగా వచ్చిన ఓ కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. ఈ ప్రమాదం గద్వాల మండలం, దెయ్యాల వాగు వద్ద చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు పరిస్థితిని సమీక్షించారు. కారు డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తికి సైతం తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి దగ్గర ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రైవేట్-బస్సు- ట్యాంకర్ ఢీకొట్టడంతో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం చిన్నబోయినపల్లి దగ్గర కల్వర్టును కారు ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని ములుగు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వేగంగా దూసుకొచ్చిన ఓ కారు కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒక్కరు మరణించగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం ఏటూరునాగారం మండలం, చిన్నబోయినపల్లి దగ్గర జరిగింది. ప్రమాద విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయాలైన వ్యక్తిని మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఈ ప్రమాదానికి పొగమంచే కారణమయ్యుంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దారి సరిగ్గా కనపడక కారు డ్రైవర్ కల్వర్టును ఢీకొట్టి ఉంటాడని పోలీసులు చెబుతున్నారు.

### టాటా ఏస్ బోల్తా: పలువురికి గాయాలు

ఖమ్మం జిల్లాలోని కారేపల్లి మండలం బత్యాతండా వద్ద రోడ్డు ప్రమాదం సభవించింది. ఆటోను తప్పించబోయి అదుపుతప్పిన టాటా ఏస్ వాహనం పల్టీలు కొట్టింది. ఈ దుర్ఘటనలో వాహనంలో ప్రయాణిస్తున్న వారిలో 17 మంది కూలీలు గాయపడ్డారు. బాధితులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. కూలీలంతా మిరపకాయలు ఏరేందుకు టాటా ఏస్ వాహనంలో వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.




గద్వాల జిల్లాలో ట్రాక్టర్‌ను ఢీకొని ప్రమాదానికి గురయిన కారు

## తెలంగాణ ఎన్నారై పాలసీ మంచి నిర్ణయం

### సిఎంకెసిఆర్‌కు ధన్యవాదాలు తెలిపిన గల్ఫ్ కార్మికులు

హైదరాబాద్,జనవరి22(ఆర్ఎన్ఎ): తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలని ప్రముఖ ఎన్నారై సంపత్ పుల్కం తెలిపారు. తెలంగాణ ఎన్నారైల కోసం ప్రత్యేక పాలసీ తయారు చేసేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలని ఆయన అన్నారు.

రాష్ట్రం నుంచి పొట్టకూటి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన వారిని ప్రత్యేకంగా గుర్తించి, వారిని ప్రోత్సహించే విధంగా, దేశంలోనే అత్యుత్తమ పాలసీగా తెలంగాణ ఎన్నారై పాలసీ ఉండేలా ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకుంటారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రెండేళ్ల కిందట జరిగిన ప్రవాస తెలంగాణవాసుల సమావేశంలో ఎన్ఆర్ఐ సెల్‌కి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ. 100 కోట్లు కేటాయించి, తమ రాష్ట్రం నుంచి వెళ్లిన కార్మికులు విదేశాల్లో ఇబ్బంది పడకూడదని ఆయన ఈ నిధిని కేటాయించారు. ఇప్పటికే పలువురు కార్మికుల విన్నపాలు తెలుసుకొని, వారికి అండదండగా నిలిచిన ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. త్వరలో ప్రకటించనున్న ఎన్నారై పాలసీపై కేసీఆర్ ప్రత్యేక ముద్ర ఉండాలని కోరుకుంటున్నట్లు ఆయన ఆకాంక్షించారు. అన్ని వర్గాల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి గల్ఫ్ కార్మికులకు శుభవార్త అందించబోతున్నందుకు సంతోషంగా ఉందని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. కాగా, సంపత్ పుల్కం కరీంనగర్ జిల్లా, పెగడపల్లి మండలం, రాములపల్లె గ్రామానికి చెందినవాడు.

## ఒకే కుటుంబానికి చెందిన ముగ్గిరి హత్య

రాయ్‌పూర్,జనవరి23(ఆర్ఎన్ఎ): ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు హత్యకు గురయ్యారు. ఛతీస్‌ఘడ్ రాష్ట్రంలోని మనిమగ్రా ప్రాంతానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులను గుర్తు తెలియని దుండగులు హత్య చేశారు. ఈ ప్రమాదంలో మరో వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గాయపడిన మరో వ్యక్తిని మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రిలో చేర్పించారు. ఈ హత్యలకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

## బోస్‌కు మంత్రి కెటిఆర్ నివాళి

హైదరాబాద్,జనవరి23(ఆర్ఎన్ఎ): నేతాజీ సుభాష్ చంద్రబోస్ 124వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ నేతాజీకి నివాళులర్పించారు. ట్విట్టర్ ద్వారా మంత్రి కేటీఆర్ స్పందిస్తూ.. ధైర్య సాహసాలను నూరిపోసి వ్యక్తి.. పరీక్షా సమయంలో ఆశలు రేకెత్తించిన యోధుడు.. స్వాతంత్ర్య పోరాటంలో తరాల భారతీయులకు ప్రేరణగా నిలిచిన మహోన్నత వ్యక్తి సుభాష్ చంద్రబోస్ అని మంత్రి కొనియాడారు.

# చివరి కోరికపై నిర్భయ దోషుల మౌనం

### ఉరితీత ఏర్పాట్లలో తీహార్ జైలు అధికారులు

న్యూఢిల్లీ,జనవరి23(ఆర్ఎన్ఎ): తమ చివరి కోరికపై నిర్భయ కేసు దోషులు మౌనం వహించారు. దేశ రాజధాని నగరం ఢిల్లీలో 2012లో వైద్య విద్యార్థినిపై జరిగిన సామూహిక దారుణ అత్యాచార సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పలు విచారణల అనంతరం ఢిల్లీ హైకోర్టు ఫిబ్రవరి 1వ తేదీ ఉదయం 6 గంటలకు దోషులకు ఉరిశిక్ష అమలు జరపాల్సిందిగా ఉత్తర్వులు వెలువరించింది. ఈ నేపథ్యంలో దోషులను తమ చివరి కోరిక వెల్లడించాల్సిందిగా అడగగా మౌనం దాల్చారు. దోషులు ముఖేష్ సింగ్, వినయ్‌శర్మ, అక్షయ్ సింగ్, పవన్ గుప్తాలు తమ చివరి కోరి వెల్లడిపై మౌనం వహించారు. కుటుంబ సభ్యులను కలవడం, తమకు చెందిన ఆస్తులను ఇష్టపూర్వకంగా ఇతరులకు ఇవ్వడం వంటి ఏ ఇతర అంశాలపైనా దోషులు మాట్లాడేందుకు నిరాసక్తత చూపారు.

# దావోస్ అట్రాక్షన్.. తెలంగాణ లాంజ్




హైదరాబాద్, జనవరి 23: దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సు జరుగుతున్న విషయం తెలిసిందే. అక్కడ తెలంగాణ లాంజ్.. ఓ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. తెలంగాణ ఐటీశాఖ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో.. ఆ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఆర్థిక సదస్సుకు హాజరైన అనేక ప్రపంచ దేశాలు తమ పెవిలియన్లను దావోస్‌లో ఏర్పాటు చేశాయి.

కానీ తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన లాంజ్.. ప్రపంచ వేటి పారిశ్రామికవేత్తలను ఆకర్షిస్తున్నది. వాణిజ్యవేత్తలకు తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సదుపాయాలతో కూడిన ఓ వాల్ డిజైన్.. అక్కడికి వచ్చిన వారిని విశేషంగా ఆకట్టుకుంటున్నది. రాష్ట్ర వృద్ధిని ఆ వాల్ డిజైన్‌లో చూపిన వైనం చాలా ప్రొఫెషనల్‌గా ఉంది. ఎన్నో ప్రఖ్యాత సంస్థల సీఈవోలు, అధినేతలు తెలంగాణ స్టాల్‌లో ప్రత్యేకంగా మంత్రి కేటీఆర్‌తో భేటీ అవుతున్నారు. ఇదే స్టాల్‌లో వాళ్లంతా చర్చలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లో 800 ఫార్మా, బయోటెక్ సంస్థలు ఉన్నాయని, వాటి వ్యాపారం సుమారు 50 బిలియన్ల డాలర్లు ఉంటుందన్న సందేశాన్ని ఓ వాల్ పోస్టర్‌లో ప్రజెంట్ చేశారు. మార్స్ గ్రహానికి ఇస్రో ఓ ఆర్బిటార్‌ను పంపిన విషయం తెలిసిందే. అయితే ఆ ఆర్బిటార్‌లో వాడిన సుమారు 30 శాతం పరికరాలు తెలంగాణలోనే తయారయ్యాయని మరో వాల్‌ను డిజైన్‌ను చేశారు. హైటెక్ హంగులతో డిజైన్ చేసిన తెలంగాణ స్టాల్ నిజంగానే కేక పుట్టిస్తున్నది. ఇన్వెస్ట్ తెలంగాణ బ్రౌచర్ కూడా పారిశ్రామికవేత్తలను ఆకర్షిస్తున్నది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పలు టెకీ సంస్థలు హైదరాబాద్‌నే కేంద్రంగా ఎంచుకున్నాయని మరో వాల్‌పోస్టర్ విజిటర్స్‌ను ఆకట్టుకుంటున్నది.

## సర్పంచ్ ఎన్నికల్లో ఓటమి- పోలింగ్ బస్సు, పోలీసు జీపునకు నిప్పు!

ఉదయ్‌పూర్,జనవరి23(ఆర్ఎన్ఎ): రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ పరిధిలోని సోమావత్ గ్రామానికి సంబంధించిన పంచాయతీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ఎన్నికల్లో కృష్ణ కుమారి విజయం సాధించారు. ఓటమి పాలయిన ప్రత్యర్థులు గ్రామంలో అల్లర్లకు పాల్పడ్డారు. ఒక పోలింగ్ బస్సు, పోలీసు జీపునకు నిప్పు పెట్టారు. రాళ్లతో దాడికి పాల్పడ్డారు. వెంటనే పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆందోళన కారులను అదుపుచేశారు. సోమావత్ గ్రామంలో సర్పంచ్ ఎన్నిక కోసం ఆరుగురు అభ్యర్థులు పోటీ పడ్డారు. ఈ నేపథ్యంలో కృష్ణ కుమారికి 297 ఓట్లు వచ్చాయి. దీంతో కృష్ణ కుమారి గెలుపొందినట్లు అధికారులు ప్రకటించారు. ఇంతలోనే గ్రామంలో అల్లర్లు చోటుచేసుకున్నాయి.

# ప్లాస్టిక్ గోదామ్‌కు నిప్పు




### భారీగా ఎగిసిపడ్డ మంటలు..పొగ

హైదరాబాద్,జనవరి22(ఆర్ఎన్ఎ): నగర శివారు మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ప్లాస్టిక్ స్క్రాప్ గోడౌన్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. భారీగా మంటలు ఎగిసిపడడంతో పాటు, భారీగా పొగ కమ్ముకుంది. గోడౌన్ యాజమాన్యం రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చింది. ఫైర్ ఇంజన్.. ప్రమాద స్థలానికి చేరుకోగా, సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణహాని జరగలేదు. కాగా, ఈ స్క్రాప్ గోదాంకు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేవు. సంబంధిత అధికారుల అండదండలతో ఈ గోదాం అక్రమ దందా కొనసాగుతున్నట్లు సమాచారం.

## కశ్మీర్‌లో ఎవరి జోక్యం అవసరంలేదు

### భారత్ పునరుద్ఘాటన

న్యూఢిల్లీ,జనవరి23(ఆర్ఎన్ఎ): కశ్మీర్ అంశం ద్వైపాక్షిమైనదని, దీంట్లో ఎవరి జోక్యమూ అవసరం లేదని భారత్ మరోసారి తన వైఖరిని తేల్చి చెప్పింది. కోరుకుంటే కశ్మీర్ సమస్య పరిష్కారంలో సాయం చేస్తానంటూ దావోస్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో తాజాగా భారత్ మరోసారి స్పందించింది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొన్న ట్రంప్.. మంగళవారం పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌తో సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలతో పాటు కశ్మీర్ అంశంపైనా చర్చ జరిగినట్లు ట్రంప్ చెప్పారు. అంతేకాకుండా కశ్మీర్ అంశంపై మధ్యవర్తిత్వం వహించి సమస్య పరిష్కారానికి సాయం చేస్తానన్నారు. దీనిపై భారత విదేశాంగ శాఖ అధికారులు స్పందిస్తూ..“ కశ్మీర్ ద్వైపాక్షిక అంశం. దీన్ని ద్వైపాక్షికంగానే పరిష్కరించుకుంటాం. ఈ విషయంలో భారత్ వైఖరి సుస్పష్టం. చర్చలు, ఉగ్రకార్యకలాపాలు ఒకేసారి కొనసాగవు. పాకిస్థాన్ ఉగ్రవాద కార్యకలాపాలు ఆపితేనే ఆ దేశంతో చర్చలు సాధ్యమవుతాయి” అని స్పష్టంచేశారు.

ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితులపై పాకిస్థాన్ విషప్రచారం మొదలు పెట్టి.. భారత ప్రభుత్వ చర్యకు వ్యతిరేకంగా అంతర్జాతీయ సమాజం మద్దతు కూడగట్టేందుకు విఫలయత్నం చేసి అభాసుపాలైంది. అంతేకాకుండా అమెరికా ద్వారా భారత్‌పై ఒత్తిడి తేవాలని చేసిన ప్రయత్నాలను మోదీ సర్కార్ దీటుగా తిప్పికొట్టింది. కశ్మీర్ అంశంలో జోక్యంచేసుకొని సమస్యను పరిష్కరించేందుకు సాయం చేస్తానంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించినా భారత్ మాత్రం అవసరం లేదని తేల్చిచెప్పేసింది. గతేడాది మోదీ అమెరికా పర్యటనకు వెళ్లిన సందర్భంలోనూ ట్రంప్‌తో భేటీ అనంతరం జరిగిన ఉమ్మడి మీడియా సమావేశంలో కశ్మీర్ వ్యవహారం ద్వైపాక్షికమైనదేనని.. ఇంకెవరి జోక్యమూ అవసరంలేదని మోదీ తేల్చి చెప్పిన విషయం తెలిసిందే.

# వ్యవసాయ కళాశాలలు ఏర్పాటు చేసుకుందాం...

హైదరాబాద్, జనవరి 23:: సీఎం కేసీఆర్ కృషి, దూరదృష్టితో ఆరేళ్లలోనే రాష్ట్రంలో సాగునీరు సమృద్ధిగా అందుబాటులోకి వచ్చిందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. రైతుల పంటల సాగుకు అనుగుణంగా సూచనలు ఇచ్చేందుకు వ్యవసాయ నిపుణుల అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సైఫాబాద్ లోని హోం సైన్స్ కళాశాలలో..ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల అసోసియేషన్ (టాసా) డైరీ, క్యాలెండర్లను మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ..ఏపీ ప్రాంతాలలో వ్యవసాయ పాలిటెక్నిక్ లు, కళాశాలలు ఏర్పాటు చేయాలో పరిశీలించాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ అనుబంధ కళాశాలల ఏర్పాటు ఆవశ్యకత ఎంతో ఉంది.

కళాశాలలపై పూర్తిస్థాయి నివేదిక ఇస్తే ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్దామన్నారు. సేద్యం పెరిగిన నేపథ్యంలో రైతులకు నాణ్యమైన విత్తన వంగడాలను అందిచాల్సిన బాధ్యత వ్యవసాయ శాస్త్రవేత్తలపై ఉందని చెప్పారు.

ఈ కార్యక్రమానికి ఉన్నత విద్యామండలి ఛైర్మన్ పాపిరెడ్డి, ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్స్ లర్ ప్రవీణ్ రావు, రిజిస్ట్రార్ సుధీర్ కుమార్, విష్ణువర్ధన్ రెడ్డి, టాసా అధ్యక్షుడు డాక్టర్ విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రజనీకాంత్, హోం సైన్స్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.




తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల అసోసియేషన్ డైరీ,క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి నిరంజన్ రెడ్డి

## చరిత్రలో నేటినిజం



కం॥ పరుషమ్మున పథములలో
పరదేశీయులను గూల్చి - భారతమునకున్
సరళమ్ముగ సేవ జేసిన
తెరువగాన్నాని షానవాజు ఖానుని గాలుమనే!!

(జనవరి 24 కెప్టెన్ షానవాజ్‌ఖాన్ జయంతి)

-రాధశ్రీ

సెల్: 9494481210



## అజారుద్దీన్‌పై చీటింగ్ ఆరోపణలు

### కేసు నమోదు చేసిన ఔరంగాబాద్ పోలీసులు

హైదరాబాద్,జనవరి23(ఆర్ఎన్ఎ): భారత మాజీ కెప్టెన్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధ్యక్షుడు మహ్మద్ అజహరుద్దీన్‌పై ఔరంగాబాద్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

అజహరుద్దీన్‌తో పాటు మరో ఇద్దరిపై కూడా కేసు నమోదయినట్లు తెలుస్తోంది. అజహరుద్దీన్‌తో పాటు మరో ఇద్దరు కలిసి తనను రూ. 20 లక్షల మేర మోసం చేశారని ఔరంగాబాద్‌కు చెందిన ఓ ట్రావెల్ ఏజెంట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తనపై వస్తున్న ఆరోపణలు, ఎఫ్ఐఆర్ నమోదు కావడంపై అజహరుద్దీన్ స్పందించారు. ఔరంగాబాద్ పోలీసులు తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ అర్థం లేనిదని ఖండించారు. తప్పుడు ఆరోపణలపై కేసు ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించారు. అంతేకాకుండా దీనిపై తాను న్యాయపోరాటం చేస్తానని పేర్కొన్నారు. అదేవిధంగా రూ. 100 కోట్లకు పరువు నష్టం దావా వేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. తన లీగల్ టీమ్‌తో చర్చించిన తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని అజహరుద్దీన్ పేర్కొన్నారు.




మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం రుప్లానాయక్ తండాలో విద్యుత్ షాక్‌తో దగ్ధమైన ఇళ్లను పరిశీలించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

# విద్యుత్ షాక్‌తో ఇండ్లు దగ్ధం

## బాధితులకు మంత్రి ఎర్రబెల్లి పరామర్శ

మహబూబాబాద్,జనవరి23(ఆర్ఎన్ఎ): తొర్రూర్ మండలం జమస్తాన్‌పురం రుప్లానాయక్ తండాలో విషాదం నెలకొంది. ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో నాలుగు ఇండ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఘటనాస్థలిని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరిశీలించి బాధితులను పరామర్శించారు. ఇండ్లు కోల్పోయిన భూక్యా కిషన్ నాయక్, జాటోతు రాములు, ఆజ్మీరా రెడ్యానాయక్, భూక్యా మక్తా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి దయాకర్‌రావు హామినిచ్చారు. కట్టుబట్టలతో రోడ్డున పడ్డ ఆ నాలుగు కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి.







# రామసేతుపై స్పందించిన సుప్రీం

## మూడు నెలల తర్వాత విచారిస్తామని వెల్లడి

న్యూఢిల్లీ,జనవరి23(ఆర్ఎన్ఎ): రామసేతును జాతీయ వారసత్వ సంపదగా గుర్తించాలని బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. అయితే ఈ అంశాన్ని మరో మూడు నెలల తర్వాత విచారణకు స్వీకరించనున్నట్లు అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇండియా, శ్రీలంక మధ్య ఉన్న సముద్రంలో రామసేతు మార్గం ఉన్నది. రామాయణం ప్రకారం.. లంకలో ఉన్న సీతను కాపాడేందుకు వానరులు రామసేతును నిర్మించినట్లు తెలుస్తోంది. అయితే సుబ్రమణ్యస్వామి వేసిన పిటిషన్‌పై సీజేఐ ఎస్ఏ బోబ్డే గురువారం స్పందించారు. రామసేతు పిటిషన్‌ను మరో మూడు నెలల తర్వాత లేవనెత్తాలని బీజేపీ నేతను చీఫ్ జస్టిస్ కోరారు. ధర్మాసనంలో జస్టిస్ ఎస్ఏ నజీర్, సజీవ్ ఖన్నా ఉన్నారు. 2017లో ఇదే అంశంపై కేంద్ర మంత్రి సమావేశం నిర్వహించారని, రామసేతును జాతీయ వారసత్వ సంపదగా గుర్తించాలని అప్పుడు అంగీకరించారని సుబ్రమణ్యస్వామి అన్నారు. వివాదాస్పద సేతుసముద్రం షిప్ కెనాల్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా బీజేపీ నేత దీనిపై గతంలో పిల్ వేశారు.

# ఆయుధాలతో లొంగిపోయిన మిలిటెంట్లు

గౌహతి,జనవరి23(ఆర్ఎన్ఎ): నిషేధిత ఎనిమిది ఉగ్రవాద సంస్థలకు చెందిన 644 మంది మిలిటెంట్లు గురువారం ఆయుధాలతో సహా లొంగిపోయారు. ఈ ఘటన అసోంలో చోటుచేసుకుంది. ఉల్ఫా, ఎన్‌డీఎఫ్‌బీ, ఆర్ఎన్ఎల్ఎఫ్, కేఎల్ఓ, సీపీఐ(మావోయిస్టు), ఎన్ఎస్ఎల్ఏ, ఏడీఎఫ్, ఎన్ఎల్ఎఫ్‌బీ గ్రూపులకు చెందిన 644 మంది మిలిటెంట్లు 177 ఆయుధాలతో సీఎం సర్బానంద సోనోవాల్ సమక్షంలో లొంగిపోయారు. ఈ సందర్భంగా సీఎం సర్బానంద సోనోవాల్ మాట్లాడుతూ.. రాష్ట్రానికి, అసోం పోలీసులకు ఇది ఎంతో ముఖ్యమైన రోజు అని అన్నారు. ఆయుధాలు విసర్జించి మిలిటెంట్ గ్రూపులకు చెందిన నాయకులు, కేడర్ జనజీవన స్రవంతిలో కలవడం శుభపరిణామన్నారు.

# మాది ఫార్మర్ ఫ్రెండ్లీ ప్రభుత్వం : మంత్రి హరీష్ రావు



హైదరాబాద్, జనవరి 23 : బంజారాహిల్స్‌లో నాబార్డు రాష్ట్ర రుణ ప్రణాళిక సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీష్ రావు హాజరయ్యారు. ఈ సదస్సులో ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ మయా, ఆంధ్రా బ్యాంక్ ఈడీ కుల్‌భూషణ్, నాబార్డు సీజీఎం విజయ్‌కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. నాబార్డు స్టేట్ ఫోకస్ పేపర్ 2020-21ని మంత్రి హరీష్ రావు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ స్వయంగా రైతు కాబట్టే.. రైతుల సమస్యలు ఒక్కొక్కటి పరిష్కరిస్తున్నారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఫార్మర్ ఫ్రెండ్లీ ప్రభుత్వమని మంత్రి స్పష్టం చేశారు. గోదాముల నిర్మాణం, సూక్ష్మ సేద్యానికి నాబార్డు అండగా నిలిచిందన్నారు. రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్‌తో రైతులకు భరోసా ఇచ్చామని హరీష్ రావు పేర్కొన్నారు.

# ఓటర్లకు దండాలు ముగిసాయి

## అందరి చూపూ కౌంటింగ్‌పైనే

సిరిసిల్ల,జనవరి23(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల వరకు ఓటర్ల చుట్టూ వంగివంగి సలాం చేసిన నేతలు ఇప్పుడు వారివైపు చూడడం మానేశారు. ఒక్కరోజులోనే వారిలో మార్పు వచ్చింది.

నవరాత్రుల్లో వినాయకుడు పూజలు అందుకున్నట్లు సామాన్య ఓటర్లు తొమ్మిది రోజులుగా నాయకులతో పూజలు అందుకున్నారు. నాయకులు నిత్య నైవేద్యంగా మద్యం, మటన్, నోట్లతో ఓటర్లను కొలిచారు. ఈ రోజులకు వీరే మహారాజులుగా వెలుగొందారు. మున్సిపల్ ఎన్నికలకు చివరి రోజు వరకు ప్రతిక్షణం వరకు ఓటరన్న చుట్టూ 'దండాలయ్యా' అంటూ ప్రార్థిస్తూ ప్రదక్షిణలు చేశారు. పొద్దు సద్దుమణిగి ఓటరు ముద్ర బ్యాలెట్ బాక్సుల్లో భద్రం కావడంతోనే ఓటరన్నను పలకరించేవారు కరువయ్యారు.

ఓటర్లు మాత్రం అభ్యర్థుల నుంచి వచ్చిన నజరానాలు, నోట్ల లెక్కలు, ఖుషీ, ఖుషీ దావత్‌లను లెక్కలు వేసుకుంటున్నారు. ఓటరు దీవెన ఎవరివైపు నిలిచిందో ఫలితాలు ఎలా ఉన్నాయో తెలియక అభ్యర్థులకు మాత్రం టెన్షన్ మొదలైంది. 25న కౌంటింగ్ జరిగితేగానీ ఉత్కంఠకు తెరపడనుంది. సిరిసిల్ల, వేములవాడ రెండు మున్సిపాలిటీల్లో 62 వార్డుల్లో 274 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. 163 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అభ్యర్థులు తమ వార్డులోని ప్రతీ ఓటరును పోలింగ్ కేంద్రానికి సాదారంగా ఆహ్వానించి ఓటు వేయించుకున్నారు. ఓటరన్న మారాజు పదవికి సెలవు పలకగా అభ్యర్థులకు తమ పదవిపై ఉత్కంఠ మొదలైంది.

# శనివారం కూడా మిర్చి కొనుగోళ్లు

## పంటదిగుబడుల దృష్ట్యా నిర్ణయం

## భద్రాద్రి జిల్లాలో తుది దశకు ధాన్యం సేకరణ

ఖమ్మం,జనవరి23(ఆర్ఎన్ఎ): ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఈ నెల 25న శనివారం సైతం మిర్చి కొనుగోళ్ళు జరుగుతాయని మార్కెట్ సెక్రెటరీ రత్నం సతోష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. భారీగా తరలి వస్తున్న మిర్చిని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. సాధారణంగా గతంలో శనివారాలు మిర్చి కొనుగోళ్ళు జరగవని ప్రస్తుతం సెలవులు, రద్దీ దృష్ట్యా ఈ సీజన్‌లో సుమారు 11 శనివారాల్లో కూడా మిర్చీ లావాదేవీలు జరపాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. రైతులు మార్పును గ్రహించి మార్కెట్‌కు పంటను తీసుకురావచ్చని తెలిపారు. ఇదిలావుంటే జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు తుది దశకు చేరాయి.

ఇదిలావుంటే ధాన్యం కొనుగోళ్లను 25వ తేదీ నాటికి పూర్తి చేయనున్నట్లు కొత్తగూడెం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు తెలిపారు. రైతుల వద్ద ఇంకా ధాన్యం నిల్వలు ఉంటే మరో రెండు రోజుల పాటు గడువును పొడిగిస్తామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ నెల 27 నాటికి కొనుగోళ్లను పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లాలో ధాన్యం సేకరణ లక్ష్యాన్ని 1 నుంచి 1.50 లక్షల మెట్రిక్ టన్నులకు నిర్దేశిరచుకున్నారు. ఇప్పటి వరకు 1.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించామని వెల్లడించారు. రైతులు పండించిన ధాన్యం విక్రయాల్లో దళారీ వ్యవస్థను నియంత్రిస్తూ నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేసేందుకు ప్రత్యేకంగా సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా రైతుల నుంచి నేరుగా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. ధాన్యం సేకరణ బాధ్యతలను సెర్ప్, జీసీసీ, సహకార సంఘాలకు అప్పగించింది. ఈ ఏడాది వానాకాలంలో పండిన ధాన్యం కొనుగోలుకు జిల్లావ్యాప్తంగా 114 సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. పెరిగిన సాగు విస్తీర్ణానికి అనుగుణంగా 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ కేంద్రాలకు వస్తుందని భావిస్తున్నారు. కానీ ఇప్పటి వరకు 1.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంను కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించారు. ఈ లెక్కన రైతుల వద్ద ఇంకా 35 నుంచి 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లను ఈ నెల 25వ తేదీ నాటికి నిర్దేశిరచిన గడువులోగా పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించు కున్నారు. రైతుల వద్ద ఇంకా ధాన్యం నిల్వలు ఉండటంతో గడువును మరో 2 రోజులు పెంచే అవకాశాలు కూడా ఉన్నట్లు అధికారుల సమాచారం. దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను రైతుకే అందించాలన్న ప్రధాన ఉద్దేశంతో పౌర సరఫరాల శాఖ జిల్లాలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. కొనుగోలు కేంద్రానికి రైతులు తరలించిన ధాన్యంను విక్రయించిన తర్వాత నగదు చెల్లింపునకు అధికారులు పక్కా ధ్రువీకరణ పత్రాలు సేకరిస్తున్నారు. రైతు ఆధార్, గ్రామ రెవెన్యూ అధికారి ధ్రువీకరణ పత్రం, భూమి వివరాలు, బ్యాంక్ ఖాతా నెంబర్ (ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌తో కలిపి), పాసు పుస్తకం నకళ్లను అధికారులు సేకరిస్తున్నారు. అదేవిధంగా బ్యాంక్ ఖాతా వినియోగంలో ఉన్నట్లు సంబంధిత అధికారుల చేత ధ్రువీకరించాలి. రైతు మొబైల్ నెంబర్ లేకుంటే వారి కుటుంబ సభ్యుల నెంబర్‌నైనా తీసుకుంటున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు, నగదు చెల్లింపుల్లో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా రైతు బ్యాంక్ ఖాతాలో జమ చేసేలా ఆన్‌లైన్ విధానాన్ని తీసుకొచ్చి దేశంలోనే ఆదర్శంగా నిలిచింది.

# ఆదిలాబాద్‌లో విజయం మాదే

## కెసిఆర్‌పై ప్రజల్లో పెరిగిన నమ్మకం: జోగు

ఆదిలాబాద్,జనవరి23(ఆర్ఎన్ఎ): ఆదిలాబాద్ మున్సిపాలిటీపై టీఆర్ఎస్ జెండా ఎగరేయడం ఖాయమని ఎమ్మెల్యే జోగు రామన్న ధీమా వ్యక్తం చేశారు. అన్నివర్గాల ప్రజలు టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆదరించారని, సర్వేలు తమకే అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్నారు. పోలింగ్‌లో పాల్గొన్నప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు టిఆర్ఎస్ పట్ల సానుకూలంగా ఉన్నారని అన్నారు. అందుకే తాము భరోసాగా ఉన్నామని అన్నారు. టీఆర్ఎస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నివాసంలో పలువురు నేతలు కలసి తాజా పరిస్థితిని విశ్లేషించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగురామన్న మాట్లాడుతూ.. టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలువడం ఖాయమన్నారు. రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి తమ పార్టీ అభ్యర్థులకు పట్టణం ఓటర్లు బ్రహ్మరథం పట్టారని తెలిపారు. ఈ విషయం సర్వేల ద్వారా తమకు తెలిసిందన్నారు. ప్రతిపక్షాల ఆరోపణలు పట్టించుకోకుండా అభివృద్ధి కోసం టీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టనున్నారని ఆనందం వ్యక్తం చేశారు. తమ అభ్యర్థులను ఆదరించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదిలాబాద్ మున్సిపాలిటికి బుధవారం పోలింగ్ ముగియగా బ్యాలెట్ బాక్సుల్లో అభ్య ర్థుల భవితవ్యం నిక్షిప్తమైంది. పట్టణంలో 49 వార్డులు ఉండగా 286 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరి భవితవ్యం ఈ నెల 25న తేలిపోనున్నది. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను జిల్లా కేంద్రంలోని టీటీడీసీకి తరలించారు. అక్కడే కౌంటింగ్ నిర్వహించనున్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. భద్రతను ఎస్పీ విష్ణువారియర్ పర్యవేక్షిస్తున్నారు. టీఆర్ఎస్, బీజేపీ పార్టీల అభ్యర్థులు అన్ని వార్డుల్లో పోటీలో ఉన్నారు. కాంగ్రెస్, ఎంఐఎం, ఇండిపెండెంట్‌లతో కలిపి మొత్తం 286 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఈ నెల 14న నామినేషన్ల ప్రక్రియ ముగిసిన వెంటనే 15 నుంచి వారం రోజుల పాటు అభ్యర్థులు తాము పోటీ చేస్తున్న వార్డుల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుచరులతో కలిసి వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. మైకులు, వాల్‌పోస్టర్‌లు, తమ గుర్తులతో కూడిన పత్రాలతో ఓటును అభ్యర్థించారు. ర్యాలీలు, రోడ్‌షోలతో పాటు ఇంటింటా ప్రచారం చేపట్టారు. మున్సిపల్ పరిధిలో మిగితా పార్టీల కన్నా టీఆర్ఎస్ ప్రచారంలో ముందంజలో నిలిచింది. జిల్లా పరిషత్ చైర్మన్ జనార్దన్ రాథోడ్, డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ లోక భూమారెడ్డి, ఆదిలాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపురావు, మాజీ ఎంపీ నగేశ్ అన్ని వార్డుల్లో టీఆర్ఎస్ అభ్యర్థుల తరఫున ప్రచారం చేపట్టారు. బ్యాలెట్ పేపర్ విధానంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. పలు వార్డుల్లో 4 నుంచి 10 వరకు అభ్యర్థులు పోటీలో నిలిచారు. దీంతో దాదాపు 70.05 శాతం పోలింగ్ నమోదైంది. ఈ నెల 25న ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభంకానున్నది. మధ్యాహ్నం తర్వాత ఫలితాలు వెలువడనున్నాయి.

# 24న ప్రారంభం కానున్న నాగోబా జాతర

## పవిత్ర జలాలతో నాగోబా విగ్రహాన్ని శుద్దితో మొదలు

## పూర్తి కావచ్చిన జాతర ఏర్పాట్లు

## కలెక్టర్,ఎస్పీల ప్రత్యేక పర్యవేక్షణ

ఆదిలాబాద్,జనవరి23(ఆర్ఎన్ఎ): ఆదిలాబాద్‌జిల్లాలోని మెస్రం గిరిజనుల ఆరాధ్య దైవం నాగోబాకు ఈనెల 24వ తేదీ శుక్రవారం రాత్రి ఘనంగా మహా పూజలు నిర్వహించనున్నారు. మహాపూజ జరిగే సమయంలో వటవృక్షం నుంచి నాలుగు దివ్వెలు వెళ్లి ఆలయంలో ఉన్న ఆదిశేషుని విగ్రహం ముందు ఉంటాయని గిరిజనుల ప్రగాఢనమ్మకం. దీపాలు జాతర తరువాత తిరిగి వటవృక్షం దగ్గరకు వెళ్లి మాయం అవుతాయని మెస్రం గిరిజనులు భావిస్తున్నారు. మహాపూజ జరిగే సమయంలో ఆలయ ప్రాంగణం దైదీప్యమానంగా వెలుగుతుంది. గోదావరి నది నుంచి తీసుక వచ్చిన పవిత్ర జలాలతో నాగోబా విగ్రహాన్ని శుభ్రపరచి సాంబ్రాణి దూపంతో ఆలయం శుద్ధి చేస్తారు. కేస్లాపూర్‌లోని నాగోబాకు శుక్రవారం మహాపూజ నిర్వహించిన అనంతరం శనివారం నుంచి కేస్లాపూర్ నాగోబా జాతర ప్రారంభం అవుతుంది. ఉమ్మడి రాష్ట్రంలోని నాగోబా జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం సైతం సమ్మక్క, సారక్క జాతర తరహాలోనే ప్రత్యేక నిదులు నాగోబా జాతరకు కేటాయిస్తుంది. జిల్లాలోని గిరిజనులతో పాటు గిరిజనేతరులు, పలు రాష్ట్రాలకు చెందిన భక్తులు నాగోబా జాతరకు తరలి వస్తారు. ప్రతియేటా కనీసం రెండు లక్షల మంది భక్తులు నాగోబాను దర్శించుకోవడం జరుగుతుంది. జిల్లాలోని గిరిజనులు సైతం నాగోబా జాతరలో తమకు కావాల్సిన నూతన సరుకులు, వస్తువులు కొనుగోళ్ల చేసుకుంటారు. ప్రతియేటా గిరిజనులు వివిధ గ్రామాల నుంచి వచ్చి జాతరలో కలుసుకుని కష్ట సుఖాలను ఒకరికొకరు పంచుకుంటారు. ప్రత్యేక పూజ సమయంలో నానపెట్టి మొలకెత్తిన నవధాన్యాలను తెచ్చి రాగిచెంబులో ఉంచి నవధాన్యాలు మొలకలు, పాలు, నూతన దస్తీ కప్పి పుట్టపైన ఉంచుతారు. పుట్టమీద దస్తీ పైకెత్తినట్లు కనిపిస్తే మెస్రం గిరిజనులు పూజా కార్యక్రమాలు ప్రారంభిస్తారు.

ఇప్పటికీ నాగదేవత రాగి చెంబులోని పాలు తాగుతుందని మెస్రం గిరిజనులు విశ్వసిస్తారు. పుష్యమి అమావాస్య రోజున మెస్రం గిరిజనులు సంస్కృ తి, సంప్రదాయాలు, వాయిద్యాల మధ్య పూజలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. గత పౌర్ణమి నుంచి తమ కుల దైవానికి కేస్లాపూర్ ప్రత్యేక పూజలు నిర్వహించిన కటోడ. హన్మంత్‌రావు ఆధ్వర్యంలో గిరిజనులు పవిత్ర జలాల కోసం గోదావరికి కాలినడకన బయలుదేరి తిరిగి మూడురోజుల ముందు ఇంద్రా యికి పూజలు నిర్వహించిన అనంతరం కేస్లాపూర్‌లోని మర్రిచెట్టు నీడకు చేరుకున్నారు. మర్రిచెట్టు వద్ద ఉన్న మోదుగాకుల చెట్టుపై గోదావరి జలాల కలశాన్ని భద్రంగా ఉంచిన మెస్రం వంశీయులు శుక్రవారం రాత్రి నాగోబా విగ్రహానికి గోదావరి జలాలతో సంప్రదాయబద్ధంగా అభిషేక పూజలు నిర్వహించనున్నారు.

అభిషేక పూజల సమయంలో ఇతరులను ఎవరిని మెస్రం గిరిజనులు ఆలయంలోకి ప్రవేశించనీయరు. అంతకుముందు మెస్రం ఆడపడచుల ఆధ్వర్యంలో మర్రిచెట్టు వద్ద ఉన్న కోనేరు నుంచి కొత్తకుండల్లో నీళ్లు తెచ్చి ఆలయాన్ని శుద్ధి చేస్తారు. నాగోబా పూజల అనంతరం మర్రిచెట్టు వద్ద ఉన్న మెస్రం గిరిజనులందరు గోవ్వాడ్‌కు చేరుకుంటారు. ÷ుక్రవారం రాత్రి నుంచి నాలుగు రోజుల పాటు గోవ్వాడ్‌లో మెస్రం గిరిజనులు విడిది చేస్తారు. కేవలం మెస్రం గిరిజనులు మాత్రమే గోవ్వాడ్‌లో నివసిస్తు ప్రతీరోజు నాగదేవతకు కావాల్సిన నైవేద్యాలను వండి పెడుతూ పూజలు నిర్వహిస్తారు. జిల్లాతో పాటు మహారాష్ట్ర, ఆంధప్రదేశ్, మధ్యప్రదేశ్, చత్తీ?సగడ్, ఒరిస్సా రాష్ట్రాలోని మెస్రం గిరిజనులూ తరలివచ్చి గోవ్వాడ్ సమీపంలో బస చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం కేస్లాపూర్ నాగోబా జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించడంతో పాటు అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయడంతో జిల్లా అధికార యంత్రాంగం జాతరకు కావాల్సిన ఏర్పాట్లను పూర్తి చేసింది. అధికారులు ఇప్పటికే రూ.26 లక్షలు కేటాయించి అభివృద్ధి కార్యక్రమా లు చేయిస్తున్నారు. మెస్రం గిరిజనులు కేస్లాపూర్ నాగోబా జాతరలోని మర్రిచెట్టు వద్ద విడిది చేసే ప్రాంతంలో పురాతన బావి వద్ద ఐటీడీఏ అధికారులు కోనేరును నిర్మించారు. ÷రిళినేరు సమీపంలోని గిరిజనులకు అవసరమయ్యే తాగునీటి వసతితో పాటు మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేశారు. జాతరలో విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి జనరేటర్ల ను సైతం సిద్ధం చేశారు. కేస్లాపూర్ నుంచి మర్రి చెట్టు వరకు రోడ్డు వెడల్పు పనులు పూర్తి చేశారు. జాతరలో ప్రజలకు కావాల్సిన సౌకర్యాలను సమకూర్చారు. జిల్లా కలెక్టర్ దివ్యదేవరాజన్, ఐటీడీఏ పీవో క్రిష్ణఆదిత్య జాతరలోని సౌకర్యాలను సమీక్షించుకోగా ఎస్పీ విష్ణు వారియర్ సైతం, ఉట్నూర్ ఏఎస్పీ శబరీష్, సీఐ నరేష్‌కుమార్‌ల ఆధ్వర్యంలో శాంతి భద్రతలు సమీక్షించారు.

# ఉమ్మడి జిల్లాలో అన్నింటా గెలుపు మాదే

## ప్రజలు అభివృద్దిని కోరుకుంటున్నారన్న మంత్రి

## గెలుపుపై కాంగ్రెస్,బిజెపిల్లోనూ ధీమా

నిజామాబాద్,జనవరి23(ఆర్ఎన్ఎ): ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అన్ని మున్సిపాలిటీల్లో గెలుపు టిఆర్ఎస్‌దేనని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్,బిజెపిలను ప్రజలు నమ్మలేదని, టిఆర్ఎస్‌తోనే అభివృద్ది సాధ్యమని గుర్తించారని అన్నారు. అందుకే ప్రజలు అధికార టిఆర్ఎస్‌కు ఓటేశారని ధఈమా వ్యక్తం చేశారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠం టీఆర్ఎస్‌దేనని మంత్రి అన్నారు. బీజేపీ చేస్తున్న ఆరోపణల్లో పసలేదన్నారు. ఆ పార్టీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తూ ఓట్లు దక్కించుకోవాలని చూసినా ప్రజలు టిఆర్ఎస్‌కే పట్టం కట్టారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు తెరవెనుక అనైతిక పొత్తులు పెట్టుకుంటున్నాయని విమర్శించారు. 60 సీట్లలో 45 నుంచి 50 సీట్లు టీఆర్ఎస్‌కు వస్తాయని తేలిందని అన్నారు. బిజెపి కుట్ర రాజకీయాలకు చరమగీతం పాడారని అన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి కర్రుకాల్చి వాతపెడతారని విమర్శించారు. ప్రజలకు సిఎం కెసిఆర్‌పై అచంచల విశ్వాసం ఉందని, ఏదైనా అనుకుంటే చేస్తారనే నమ్మకం వారిలో ఉందని మంత్రి పేర్కొన్నారు. రాజకీయాల కోసం తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు ఏనాడూ గురిచేయలేదని ఎంపీ అర్వింద్‌ను ఉద్దేశించి విమర్శించారు. బీజేపీ ఇచ్చిన మ్యానిఫెస్టోలో మొత్తం టీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులే ఉన్నాయని, దీన్ని బట్టే ప్రజలకు తెలిసిపోయిందని, బీజేపీ వచ్చి నగరానికి చేసేదేమీ లేదని ఆయన ఎద్దేవా చేశారు. పది సీట్లు వచ్చిన్నాడే టీఆర్ఎస్ మేయర్ సీటు కైవసం చేసుకున్నదని, 45 సీట్లకు పైగా గెలిచేందుకు అవకాశం ఉన్నప్పుడు మేయర్‌గా వేరెవరికో ఇవ్వబోమన్నారు. అధికారంలోకి వస్తే ఊర్ల పేర్లు మారుస్తామంటూ బీజేపీ ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ఇకపోతే ఎన్నికలు ముగియడంతో బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారని అన్నారు. ఈనెల 25న కౌంటింగ్ ఉంటుంది. అదే రోజు ఫలితాలు ప్రకటిస్తారు. ఎవరికివారే గెలుపు అవకాశాలపై అంచనాలు వేసుకుంటూ కౌంటింగ్ రోజు కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. టీఆర్ఎస్ మాత్రం అన్ని మున్సిపాలిటీలపై గులాబీ జెండా ఎగరవేస్తామనే ధీమాతో ఉంది. సర్వే ఫలితాలు ఆ పార్టీకి అనుకూలంగా రావడంతో గులాబీ శ్రేణుల్లో నూతనోత్తేజం కనిపిస్తోంది. నిజామాబాద్ కార్పొరేషన్ పాటు బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీల్లో మేయర్, చైర్మన్ పీఠాలను టీఆర్ కైవసం చేసుకోవడం ఇక లాంఛనమేనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల 27న మేయర్, చైర్మన్ల ఎన్నిక ప్రక్రియ ఉంటుంది. దీంతో ఫలితా లు వచ్చిన మరుసటి రోజే చైర్మన్ల ఎన్నిక ఉండడంతో సర్వత్రా ఆసక్తి, ఉత్కంఠ నెలకొన్నది. చైర్మన్ల ఎన్నికకు ఎక్కువ సమయం తీసుకోకపోవడంతో క్యాంప్ రాజకీయాలకు అవకాశం లేకుండా పోయింది. చేతులెత్తే విధానం ద్వారా మేయర్, చైర్మన్ల ఎన్నిక ఉంటుంది. ఈనెల 25న కార్పొరేషన్ ఓట్ల లెక్కింపు పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

# మైనర్ బాలికపై మాజీ సర్పంచ్ అత్యాచారం

## దాడి చేసి పోలీసులకు అప్పగించిన గ్రామస్థులు

ఖమ్మం,జనవరి23(ఆర్ఎన్ఎ): మైనర్ బాలికపై మాజీ సర్పంచ్ అత్యాచారం చేసిన సంఘటన ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలోని ఓ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మాజీ సర్పంచి కేతిరెడ్డి కోటి రెడ్డి(65) ఇంటికి ఓ బాలిక తన తండ్రికి ఫోన్ చేయడానికి వెళ్లింది. తండ్రితో ఫోన్‌లో మాట్లాడిని అనంతరం మిరపకాయలు కావాలని తీసుకరావాలని ఇంట్లోకి పంపించాడు. ఇంట్లోకి వెళ్లగానే గడియవేసి అమ్మాయిపై కోటి రెడ్డి అత్యాచారం చేశాడు. తన కూతురు ఇంకా రాలేదని వెతుక్కుంటూ కోటిరెడ్డి ఇంటికి తల్లి వెళ్లింది. మాజీ సర్పంచ్ ఇంటి నుంచి ఏడ్పు వినపడడంతో బాలిక దగ్గరకు తల్లి ఆరా తీసింది. జరిగిన విషయం గ్రామస్థులకు తెలియగానే అతడిపై దాడి చేశారు. గ్రామస్థుల సమాచారం మేరకు ఎసిపి వెంకట్ రెడ్డి, సిఐ సత్యనారాయణ రెడ్డి, ఖమ్మం సిఐ అంజలి ఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన కోటిరెడ్డి స్థానిక ఆస్పత్రికి తరలించారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కోటిరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సతీష్ కుమార్ వెల్లడించారు.

# జస్టిస్ గొగోయ్‌పై ఆరోపణలు చేసిన మహిళకు తిరిగి ఉద్యోగం?

## విధుల్లో చేరగానే ఆమె దీర్ఘకాలిక సెలవు

న్యూఢిల్లీ,జనవరి23(ఆర్ఎన్ఎ): సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ గతేడాది సంచలన ఆరోపణలు చేసిన ఓ మహిళను సుప్రీంకోర్టు మళ్లీ విధుల్లోకి తీసుకున్నట్టు సమాచారం. అయితే విధుల్లో చేరగానే ఆమె దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఆమెకు చెల్లించాల్సిన మొత్తం బకాయిలను కూడా సుప్రీంకోర్టు చెల్లించినట్టు తెలిపాయి. 2014 మేలో ఆ మహిళ సుప్రీంకోర్టులో చేరింది. అయితే అక్టోబర్ 2018లో అప్పటి సీఎస్ జస్టిస్ గొగోయ్ నివాసంలోని కార్యాలయంలో నియమించిన నాటి నుంచి తనకు ఇబ్బందులు మొదలైనట్టు ఆమె ఆరోపించింది. లైంగిక వేధింపులు జరిగినట్టు ఆరోపించిన తర్వాత తనను బదిలీ చేసి, అనంతరం విధుల నుంచి తొలగించారని ఆమె ఆరోపించారు. ప్రస్తుత సీజే జస్టిస్ ఎస్ఏ బాబ్డే నేతృత్వంలోని సుప్రీంకోర్టు అంతర్గత కమిటీ ఆమె ఆరోపణలపై విచారణ జరిపింది. ఆమె ఆరోపణలన్నీ నిరాధారమైనవంటూ జస్టిస్ గొగోయ్‌కి క్లీన్ చిట్ ఇచ్చింది. అయితే నిబంధనల ప్రకారం ఈ నివేదికను బయటికి వెల్లడించకపోవడంతో దాని తాలూకు వివరాలేవీ వెలుగుచూడలేదు. అయితే ఈ కమిటీ విచారణపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆ మహిళ... దర్యాప్తు ప్రక్రియ నుంచి పక్కకు తప్పుకుంది. కాగా గతేడాది ఏప్రిల్‌లో ఆమె చేసిన ఆరోపణలను సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్ ఖండించారు. అవన్నీ తప్పుడు ఆరోపణలేనంటూ కొట్టిపారేశారు. కాగా తనను ఉద్యోగంలో నుంచి తీసేసిన కొద్ది నెలల తర్వాత తన భర్త, సోదరుడిని ఢిల్లీ పోలీస్ విభాగం నుంచి సస్పెండ్ చేశారని కూడా ఆ మహిళ ఆరోపించింది. తిరిగి జూన్ 2019లో మళ్లీ వారిద్దరినీ విధుల్లోకి తీసుకున్నట్టు వార్తలు వచ్చాయి. మరోవైపు సుప్రీంకోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానంటూ సదరు మహిళ ఓ వ్యక్తి నుంచి డబ్బులు తీసుకున్నట్టు కూడా ఆమెపై కేసు నమోదైంది.




దావోస్ పర్యటనలో ఉన్న మంత్రి కెటిఆర్‌ను కలుసుకున్న అక్కడి ఎన్నారైలు

# 500కోట్ల పెట్టుబడి పెట్టనున్న పిరామిల్ గ్రూప్

## పిరామల్ సంస్థతో మంత్రి కేటీఆర్ సంప్రదింపులు

## దావోస్‌లో కెటిఆర్‌తో ఎన్నారైల భేటీ

హైదరాబాద్,జనవరి23(ఆర్ఎన్ఎ): హెల్త్‌కేర్ రంగానికి చెందిన పిరామల్ గ్రూపు సంస్థ తెలంగాణలో 500 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నది. కొత్త వసతుల రూపకల్పన, వేర్‌హౌజ్ విస్తరణ కోసం ఆ నిధులను ఖర్చు చేయనున్నది. బుధవారం దావోస్‌లో పిరామల్ సంస్థ చైర్మన్ అజయ్ పిరామల్‌తో .. తెలంగాణ ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌తో భేటీ అయ్యారు. దావోస్‌లో ఉన్న తెలంగాణ పెవీలియన్ వద్ద పిరామల్ సంస్థతో మంత్రి కేటీఆర్ అనేక సంప్రదింపులు జరిపారు. అయితే రానున్న మూడేళ్లలో తెలంగాణలో 500 కోట్లు ఇన్వెస్ట్ చేసేందుకు పిరామల్ సంస్థ అంగీకరించింది. పిరామల్ సంస్థ నిర్ణయాన్ని కేటీఆర్ స్వాగతించారు. ఆ సంస్థకు కావాల్సిన అన్ని అనుమతులను మంజూరు చేస్తామన్నారు. తమ పెట్టుబడితో సుమారు 500 మందికి ఉపాధి కల్పించనున్నట్లు పిరామల్ సంస్థ పేర్కొన్నది. ఇదిలావుంటే మంత్రి కేటీఆర్‌ను దావోస్‌లో స్విట్జర్లాండ్, యూకే టీఆర్ఎస్ టీమ్స్ ప్రతినిధులు కలిశారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొనేందుకు మంత్రి కేటీఆర్.. దావోస్‌కు రెండు రోజుల క్రితం వెళ్లిన విషయం విదితమే. ఈ సందర్భంగా ఎన్నారై టీఆర్ఎస్ నాయకులు కేటీఆర్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రవాస భారతీయుల విధాన రూపకల్పనకు కసరత్తు ప్రారంభించిన నేపథ్యంలో కేటీఆర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలోని పలు అంశాలపై కూడా చర్చించినట్లు ఎన్నారై ప్రతినిధులు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వానికి అవసరమైనంత వరకు సహాయం చేస్తామని వారు హామినిచ్చారు. ఇక ఎన్నారై పాలసీ త్వరలోనే అమల్లోకి వస్తుందని కేటీఆర్ చెప్పినట్లు ఎన్నారై ప్రతినిధులు తెలిపారు.

# మేడారం జాతరకు అంకురార్పణ

## గుడిమేలుగే పండుగను నిర్వహించిన పూజారులు

మేడారం,జనవరి23(ఆర్ఎన్ఎ): తెలంగాణ కుంభమేళా, మేడారం వనదేవతలు సమ్మక్క సారలమ్మల మహా జాతరకు బుధవారం అంకురార్పణ జరిగింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ పూజా మందిరాల్లో గుడిమేలుగే పండుగను సమ్మక్క-సారక్కల పూజారులు నిర్వహించారు. కాకవంశీయులు, సిద్ద బోయిన వంశీయులు వేకువజామున నిద్రలేచి, ఇళ్లను శుద్ధి చేసుకుని.. అనంతరం అమ్మవార్ల ఆలయాలను శుద్ధిచేశారు. తర్వాత నూతన వస్త్రాలను ధరించి డోలి వాయిద్యాల మధ్య సమీప అటవీ ప్రాంతంలోకి వెళ్లి గుట్ట గడ్డిని సేకరించారు. దానిని అమ్మవార్ల పూజా మందిరాలపై కప్పిన అనంతరం గద్దెలకు అలుకుపూత నిర్వహించి, రంగురంగుల ముగ్గులతో అలంకరించారు. తరువాత పూజారులు ఆలయంలో పూజలు నిర్వహించి.. దీపం పెట్టడంతో మహాజాతరకు అంకురార్పన జరిగింది. ఆ దీపం మళ్లీ రెండేళ్ల వరకు అలాగే వెలుతూనే ఉంటుందని ప్రగాఢంగా విశ్వసిస్తారు. గుడిమెలిగే పండుగతో అమ్మవార్ల మహాజాతర ప్రారంభమైనట్లు పూజారులు భావిస్తారు. నేటినుంచి నాలుగు బుధవారాల పాటు మేడారం జాతర కొనసాగుతుంది. కాగా.. రెండో బుధవారం అంటే జనవరి 29న మండమెలిగెను నిర్వహిస్తారు. మూడో బుధవారం అంటే ఫిబ్రవరి 5న అమ్మవార్ల మహాజాతర ప్రారంభమవుతుంది. జాతరలో చిలుకలగుట్టపైనున్న సమ్మక్క తల్లిని ఫిబ్రవరి 6న సాయంత్రం గద్దెపై ప్రతిష్టాపన చేస్తారు. ఫిబ్రవరి 7న సమ్మక్కసారలమ్మలతో పాటు పగిడిద్ద రాజులు, గోవిందరాజులను గద్దెలపై ప్రతిష్ఠిస్తారు. ఫిబ్రవరి 8న అమ్మవార్ల తిరుగు ప్రయాణంగా వనప్రవేశం చేయడంతో జాతర ముగుస్తుంది. ఆ తర్వాత చివరి బుధవారం అంటే ఫిబ్రవరి 12న తిరుగువారం నిర్వహిస్తారు. రెండేళ్లకోసారి నిర్వహించే ఈ మహా జాతరకు వివిధ రాష్ట్రాల నుంచే కాక ఇతర దేశాల నుంచి కూడా భక్తులు తరలిరానున్నారు.

# నేడు కరీంనగర్ కార్పోరేషన్ ఎన్నిక

## కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

## 58 డివిజన్లకు నేడు పోలింగ్..రెండు ఏకగ్రీవాలు

కరీంనగర్,జనవరి22(నేటినిజం ప్రతినిధి): రెండు రోజులు ఆలస్యంగా మున్సిపల్ సంగ్రామానికి కరీంనగర్ సిద్ధమైంది. శుక్రవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరీంనగర్ కార్పొరేషన్‌కు పోలింగ్ జరుగనుంది. ఇందుకుగానూ అధికారులు సర్వం సన్నద్ధం చేశారు.

ఎన్నికలు సజావుగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకున్నారు. పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రంతో ప్రచారం ముగిసింది. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 60 డివిజన్లున్నాయి.

వాటిలో రెండు చోట్ల టీఆర్ఎస్ అభ్యర్థులు ఏకగ్రీవంగా గెలుపొందారు. 20వ డివిజన్‌లో తుల రాజేశ్వరి, 37వ డివిజన్‌లో చల్ల స్వరూపారాణి ఏకగ్రీవంగా విజయం సాధించారు.

దీంతో మిగిలిన 58 స్థానాలకు శుక్రవారం ఎన్నిక జరుగనుంది. మొత్తం 371 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. 2 లక్షల 72వేల 195 మంది ప్రజలు ఓటు వేయనున్నారు. వారి కోసం 348 పోలింగ్ కేంద్రాలను అందుబాటులో ఉంచారు.

కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నిక నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని జేసీ శ్యాం ప్రసాద్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భద్రతను కట్టుదిట్టం చేశామన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్ తో పాటు నలుగురు సిబ్బంది ఉంటారని చెప్పారు. ఎన్నికల విధుల్లో దాదాపు 2 వేల మంది పాల్గొంటున్నారని తెలిపారు. దొంగ ఓట్లు పడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు.

పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను ఎస్ఆర్ఆర్ కళాశాలలో భద్రపరుస్తారు. ఈ నెల 27వ తేదీన కౌంటింగ్ ప్రక్రియ చేపట్టి,అదేరోజు ఫలితాలు ప్రకటిస్తారు.

# మంత్రి కెటిఆర్ పిఎ నంటూ బురిడీ

### సాయం పేరుతో 3.3 లక్షలు బ్యాంక్ ఖాతాకు మళ్లింపు
### అనుమానంతో పోలీసులకు సంస్థ ఫిర్యాదు
### దర్యాప్తు చేపట్టిన పోలీసులు

హైదరాబాద్,జనవరి23(ఆర్ఎన్ఎ): 'నేను మంత్రి కేటీఆర్ వ్యక్తిగత కార్యదర్శిని మాట్లాడుతున్నాను... పేదవాడైన ఒక జూనియర్ క్రికెటర్‌కు మీరు సహాయం చేయండి'.. అంటూ బోగస్ కాల్ చేసి ఓ రియల్ ఎస్టేట్ సంస్థకు రూ.3.3 లక్షలు టోకరా వేశాడో ప్రబుద్ధుడు. మరో రూ.2 లక్షలు కూడా మోసం చేయాలని ప్రయతి ్నంచగా బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావు, బాధితుల కథనం ప్రకారం.. ఓ ప్రైవేటు రియల్ ఎస్టేట్ సంస్థకు గత డిసెంబర్ 16న గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. తాను మంత్రి కేటీఆర్ వద్ద వ్యక్తి గత కార్యదర్శిగా పనిచేస్తున్నానని, ఆయన అధికారిక కార్యాలయం నుంచి మాట్లాడుతున్నానంటూ పరిచయం చేసుకున్నా డు. ఆంధ్రప్రదేశ్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన బుడుమూరు నాగరాజు అనే రంజీ క్రికెట్ ప్లేయర్ అండర్ 25 ప్రపంచకప్పుకు ఎంపికయ్యా డని.. ఆయనకు తక్షణం రూ.3.3 లక్షలు ఆర్థిక సాయమందించాలంటూ సదరు సంస్థకు ఫోన్ చేశాడు. ఈ సాయాన్ని మీడియా సమక్షంలో మంత్రి అందిస్తాడ ంటూ తద్వారా సంస్థకు మంచి పేరు ప్రతిష్టలొస్తాయంటూ నమ్మబలికాడు. ఇదం తా నిజమేనని నమ్మిన ఆ సంస్థ రూ.3.3 లక్షలను బ్యాంకు ఖాతా ద్వారా డిసెంబర్ 27న బదిలీ చేశారు. వారం రోజులు గడి చిన తర్వాత సంస్థ ప్రతినిధులు నిందితుడికి ఫోన్ చేశారు. స్పాన్సర్‌షిప్ అందించే కార్యక్రమం ఎప్పుడు ఏర్పాటు చేస్తారంటూ.. ప్రశ్నించగా మంత్రి బిజీగా ఉన్నారంటూ రకరకాల కారణాలు చెప్పి వాయిదా వేస్తూ వచ్చాడు. జనవరి 10న మరోసారి ఫోన్ చేశారు. అతి త్వరలోనే మంత్రి నేతృత్వంలో జరగబోయే ముఖ్యమైన కార్యక్రమానికి సదరు సంస్థకే స్పాన్సర్‌షిప్ ఇప్పిస్తామంటూ ఆశ చూపాడు. ఇదే సందర్భంలో... తమ బంధువువొకరు తీవ్ర అనారోగ్యంతో రాజమం డ్రిలో చికిత్స పొందుతున్నాడని ఓ రూ.2 లక్షల ఆర్థిక సాయం కావాలని అడిగాడు. దీంతో అనుమానం వచ్చిన ఆ సంస్థ ప్రతినిధులు సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, దర్యాప్తులో పోలీసులకు కొన్ని ప్రాథమిక ఆధారాలు లభ్యమయ్యాయి. వీటి ఆధారంగా ఏపీకి చెందిన ఓ మాజీ రంజీ క్రికెటర్ ఈ పని చేసినట్టుగా భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ తరపున 2014 నుంచి 2016 మధ్య రంజీ క్రికెట్ ఆడిన ఓ క్రికెటర్ స్పాన్సర్ షిప్‌లు ఇవ్వాలంటూ ప్రముఖుల పేర్లు చెప్పుకొని పలు మోసాలకు పాల్పడ్డాడు. గతంలో జగన్ పీఏ నంటూ నమ్మించి ఢిల్లీలోని ఓ దవాఖాన నిర్వాహకుడికి ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేసిన కేసులో అరెస్టయ్యాడు. ధోని క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేస్తున్నానంటూ నమ్మించి జైలు పాలయ్యాడు. క్రికెట్‌లో ప్రముఖుల వాయిస్‌ను ట్యాంపరింగ్ చేస్తూ మోసాలకు పాల్పడ్డాడు. అతనే హైదరాబాద్‌లోని రియల్ ఎస్టేట్ సంస్థను కూడా మంత్రి పీఏనని చెప్పుకొని మోసం చేసినట్లు పోలీసులకు ప్రాథమిక ఆధారాలు లభించాయని, అతడి కోసం గాలింపు చేపట్టామని దర్యాప్తు అధికారి మోహన్‌రావు తెలిపారు.


ఏపి విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ డైరీని ఆవిష్కరించిన ఏపి సిఎం వైఎస్ జగన్

# బిల్లుల వసూలులో నిర్లక్ష్యం వద్దు



హైదరాబాద్, జనవరి 23: వాణిజ్య కేటగిరిల నీటి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలని జలమండలి ఎండీ దానకిశోర్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రతి నెలా సరాసరి రెవెన్యూతోపాటు అదనంగా 20శాతం వాణిజ్య బకాయిల బిల్లుల వసూలును లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. రెవెన్యూ వసూలులో ఉదాసీనంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఎండీ అధికారులను హెచ్చరించారు. ఖైరతాబాద్ జలమండలి ప్రధాన కార్యాలయంలో రెవెన్యూ, ఎన్ఆర్‌డబ్ల్యూలపై ఉన్నతాధికారులతో ఎండీ దానకిశోర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మంచినీటి సరఫరా మొదలైన 5 నుంచి 15 నిమిషాలు నీటిని వృథాగా వదిలేస్తున్న ప్రాంతాలను గుర్తించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో నీటి వృథాను అరికట్టడానికి ఎలాంటి చర్యలు చేపట్టాలో నివేదిక రూపొందించాలని ఎండీ పేర్కొన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి వృథాపై అవగాహన కార్యక్రమాలు మరింతగా చేపట్టి నీటి వృథాను తగ్గించాలని సూచించారు. సివరేజీ, మంచినీటి సరఫరా కలిసి ఉన్న ప్రాంతాల్లో మం చినీటిలో మురుగునీరు కలిసే అవకాశం ఉంటుందని, ఆ ప్రాంతాలను గుర్తించి ఆయా పైపులైన్లకు మరమ్మత్తులు చేయడానికి అంచనాలు రూపొందించాలన్నారు.

మంచినీటి సరఫరాలో పైపులు, వాల్వ్‌లు ధ్వంసమై ఉన్న లేదా వృథా పోయే మంచినీటిని అరికట్టడానికిగానూ 10రోజుల్లో నివేదిక సమర్పించాలని ఎండీ అధికారులను ఆదేశించారు. వాక్ కార్యక్రమంలో భాగంగా బ్రాండింగ్ (ప్రతి ఇంటికి మంచినీటి వాడకంపై కేటాయించే రంగు గుర్తులు) ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సత్యనారాయణ, డైరెక్టర్లు అజ్మీరా కృష్ణ, పి.రవిల తోపాటు సంబంధిత సీజీఎం, జీఎం, డీజీఎంలు, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు

# శాసనమండలిలో టిడిపి తీరు గర్హనీయం

### రౌడీల్లా ప్రవర్తించారన్న బిసి ఐక్యవేదిక నేత బుద్దా

విజయవాడ,జనవరి23(ఆర్ఎన్ఎ): శాసన మండలిలో టీడీపీ సభ్యులు వ్యవహరించిన తీరు బాధాకరమని బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు బుద్దా నాగేశ్వరరావు గురువారం విజయవాడలో పేర్కొన్నారు. శాసన మండలిలో నిష్ణాతులైన వ్యక్తుల్ని ఎన్నుకుంటారని.. కానీ టీడీపీ సభ్యులు ఒక వీధి రౌడీల్లా వ్యవహరించారని విమర్శించారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా నడుచుకోవడం దారుణమని పేర్కొన్నారు. బాబు గ్యాలరీలో కూర్చుని టీడీపీ సభ్యుల చేత స్పీకర్‌ను ప్రభావితం చేయించి బిల్లులను సెలెక్ట్ కమిటీకి పంపించారని తెలిపారు. కృత్రిమ ఉద్యమం ద్వారా బలహీన పడే పరిస్థితి చంద్రబాబుకు వస్తుందని, రాష్ట్రంలో ఉన్న 23స్థానాలను కూడా పోగొట్టుకునే విధంగా ఆయన ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. వారు చేస్తున్న ఉద్యమం ద్వారా తాత్కాలికంగా ఆటంకాలు సృష్టించగలిగారే తప్ప ప్రజాస్వామ్యమైన విధానాలను ఆటంకపరచలేకపోయారని తెలిపారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖచ్చితంగా మూడు రాజధానులను ఏర్పాటు చేస్తుందని బుద్దా నాగేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు.


## ఆహ్వానము

**సాధన సాహితీ స్రవంతి, ఎం.వి.ఆర్ ఫౌండేషన్**
**శ్రీ త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో**
అప్పాజోస్యుల, విష్ణుభొట్ల, కందాళం ఫౌండేషన్ వారి
ప్రతిష్ఠాకరమైన ప్రతిభామూర్తి - జీవితకాల సాధన పురస్కారాన్ని పొందిన
శ్రీ విహారి గారి విశిష్ఠ రచన శ్రీ పదచిత్ర రామాయణం కావ్యసమాలోచన సాహితీ సదస్సు




ముఖ్యఅతిథి : డా॥ కె.వి. రమణాచారి గారు (IAS (R))
తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు

సభాధ్యక్షులు : శ్రీ సుధామ గారు, సుప్రసిద్ధ కవి, సాహితీవేత్త
ప్రధానవక్త : డా॥ ఆర్. అనంతపద్మనాభరావు గారు
సాహితీవేత్త, పూర్వ డైరెక్టర్ జనరల్ ప్రసారభారతి
విశిష్ఠ అతిథులు : శ్రీ కళా వి.యస్. జనార్ధన మూర్తి గారు
అధ్యక్షులు, శ్రీ త్యాగరాయగాన సభ
ఆచార్యముదిగొండ శివప్రసాద్ గారు
సాహితీవేత్త చారిత్రక నవలా చక్రవర్తి

తేది: 24-01-2020 శుక్రవారం, సాయంత్రం 6గం॥లకు
వేదిక: కళా సుబ్బారావు కళావేదిక, శ్రీ త్యాగరాయగాన సభ, చిక్కడపల్లి

సాధన నరసింహాచార్య — అధ్యక్షులు, సాధన సాహితీ స్రవంతి
శ్రీమతి కళా శారద — ప్రధాన కార్యదర్శి, శ్రీ త్యాగరాయగాన సభ
మట్టిగుంట వెంకటరమణ — అధ్యక్షులు, ఎం.వి.ఆర్.ఫౌండేషన్


# భూదందాల కోసమే మూడురాజధానులు

### వైకాపాపై జనసేనాని విమర్శలు
### పార్టీ నేతలతో కలసి బిజెపి అధ్యక్షుడు నడ్డాతో భేటీ

న్యూఢిల్లీ,జనవరి23(ఆర్ఎన్ఎ): మూడు రాజధానుల అంశాన్ని ప్రధాని, హోం మంత్రి దృష్టికి తీసుకెళ్లామని వైకాపా నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. వైకాపా నేతలు ఎప్పుడూ రాజధాని అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లలేదని జేపీ నడ్డా కూడా స్పష్టం చేసినట్లు పవన్ తెలిపారు. రాజధాని మార్పే విషయంలో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని, హోం మంత్రి అంగీకారం లేదు. వైకాపా నేతలు వారి భూ దందాల కోసమే రాజధానిని మార్చాలని చూస్తున్నారు. వారి స్వార్థం కోసమే ఇదంతా చేస్తున్నారు. ఫిబ్రవరి 2న భాజపా, జనసేన సంయుక్తంగా రాజధాని రైతులకు మద్దతుగా , ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ కోసం లాంగ్ మార్చ్ నిర్వహించబోతున్నాం అని పవన్ కల్యాణ్ తెలిపారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్, రాష్ట్ర భాజపా నేతలు గురువారం ఉదయం భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలిశారు. భాజపా జాతీయ అధ్యక్షుడిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయనకు ఈ సందర్భంగా పవన్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో ఇరుపార్టీల కార్యాచరణపై పవన్ ..నడ్డాకు వివరించారు. జనసేన నేత నాదెండ్ల మనోహర్, భాజపా ఎంపీ జీవీఎల్ నరసింహారావు,పురందేశ్వరి తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఏపీ బీజేపీ ఇంఛార్జ్ సునీల్ దియోదర్ కూడా ఉన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన పవన్ కళ్యాణ్ వైసీపీ పార్టీ పైనిప్పులు చెరిగారు మూడు రాజధానులకు కేంద్రం అనుమతి లేదని..వైసీపీ నేతలు పూర్తిగా అబద్దాలు చెపుతున్నారని ఆయన అన్నారు. జగన్ చెప్పే మూడు రాజధానులు వారి భూదందాల కోసమేనని ఆరోపించారు.


ఢిల్లీలో బిజెపి అధ్యక్షుడు నడ్డను కలిసిన జనసేనాని పవన్ కళ్యాణ్. చిత్రంలో ఎంపి జివిఎల్ , పురందేశ్వరి, నాదెండ్ల మనోహర్ ఉన్నారు.

# నాగోబాకు సిరికొండ కుండలు

### ఏటా ఇక్కడి నుంచే సరఫరా

నిజామాబాద్,జనవరి23(ఆర్ఎన్ఎ): సిరికొండ మండల కేంద్రంలోని గుగ్గిల్ల వంశీయులు తయారు చేసిన కుండలను సిరికొండ నుంచి నాగోబా జాతర కోసం మెస్రం వంశీయులు ప్రత్యేక వాహనంలో కెస్లాపూర్‌కు తరలించారు. ఈసందర్భంగా మెస్రం వెంకట్‌పటేల్ మాట్లాడారు ... ప్రతి సంవత్సరం సిరికొండ నుంచి కెస్లాపూర్ జాతర పండుగకు ఇక్కడి కుండలను తీసుకువెళ్తామని అన్నారు. గుగ్గిల్ల వంశీయులు చేసిన కుండలను మాత్రమే పూజలకు వినియోగిస్తామని అన్నారు. గుగ్గిల్ల వంశీయులను అతిథులుగా చూస్తామని అన్నారు. కుండలు తయారు చేసిన వారికి నాగోబా ఆలయంలో ఘనంగా సన్మానించి, జాతర అనంతరం కొంత నగదు అందిస్తామని తెలిపారు. నదీజలంతో జనవరి 20న రాత్రి కెస్లాపూర్‌కు చేరుకున్న మెస్రం వంశీయులు మర్రిచెట్ల ప్రాంతంలో కుటుంబ సమేతంగా విశ్రాంతి తీసుకుంటున్నారు. మర్రిచెట్ల ప్రాంతంలో సంప్రదాయ ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ మొక్కులను తీర్చుకుంటున్నారు. మెస్రం వంశీయుల పెద్దలు, మహిళలు, పురుషులు వేర్వేరుగా కచేరి నిర్వహించి, నాగోబా పూజలపై చర్చించారు. సిరికొండలో తయారు చేసిన మట్టి కుండలను తీసుకురావడానికి మర్రిచెట్ల వద్ద నుంచి బయలుదేరి వెళ్లారు. తీసుకవచ్చిన మట్టి కుండలను నాగోబా ఆలయం వెనుకభాగంలో భద్రంగా ఉంచారు. మర్రిచెట్ల ప్రాంతంలోని నీటి కోనేరుతో పాటు గంగాజలం రఖరి భద్రపర్చిన ప్రాంతంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయ వాయిద్యాలు, కిక్రి వాయిస్తూ నాగోబా చరిత్రపై తుకోడోజీ మెస్రం వంశీయులకు పాటల ద్వారా అవగాహన కల్పించారు. నాగోబాకు 24న నిర్వహించే మహాపూజలతోపాటు పెద్దల పేరిట అర్ధరాత్రి నిర్వహించే తుమ్‌పై చర్చించారు. మెస్రం వంశీయుల్లోని కితల వారీగా మహిళలు సామూహిక వంటలు చేస్తూ, నైవేద్యాలను వండుతున్నారు. సహపంక్తి భోజనాలు చేస్తున్నారు.

# పవన్ వర్మకు నితీశ్ చురకలు

### పార్టీ మారితే ఆయన ఇష్టమని వ్యాఖ్య

పాట్నా,జనవరి23(ఆర్ఎన్ఎ): జేడయూ సీనియర్ నేత పవన్ వర్మ ట్వీట్‌పై బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఘాటుగా స్పందించారు. ఆయన మాట్లాడుతూ..తనకు ఇష్టమైన పార్టీలో పవన్ వర్మ చేరవచ్చని, ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు నితీశ్ తెలిపారు. బీజేపీతో జేడీయూ పొత్తు విషయంలో నితిశ్ కుమార్ వెనుకడుగు వేస్తున్నట్లు కనిపిస్తుందని పవన్ వర్మ మంగళవారం ట్వీట్ చేసిన విషయం తెలిసిందే.

ఆయన మాట్లాడుతూ..ఫిబ్రవరి 8న జరగబోయే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు విషయంలో నితిశ్ కుమార్ విముఖత వ్యక్తం చేశారని పవన్ వర్మ తెలిపారు. ఈ రకంగా బహిరంగంగా వ్యాఖ్యానించడం ఏ మేరకు సమంజసమని.. పార్టీ మారాలనుకుంటే మారవచ్చని పవన్ వర్మను ఉద్దేశించి నితిశ్ కుమార్ వ్యంగ్యంగా విమర్శించారు.

# ఎలక్ట్రిక్ కారును లాంచ్ చేసిన ఎంజీ మోటార్స్

### ఎలక్ట్రిక్ కారును లాంచ్ చేసిన ఎంజీ మోటార్స్



హైదరాబాద్, జనవరి 23:ప్రముఖ కార్ల తయారీదారు ఎంజీ మోటార్స్ తన తొలి ఎలక్ట్రిక్ కారును భారత్‌లో ఇవాళ లాంచ్ చేసింది. ఎంజీ మోటార్స్ జెడ్ఎస్ ఈవీ పేరిట ఆ కారు విడుదలైంది. ఎంజీ మోటార్స్ నుంచి భారత మార్కెట్‌లో విడుదలైన తొలి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ కారు ఇదే కావడం విశేషం. కాగా ఈ కారును రెండు వేరియెంట్లలో లాంచ్ చేశారు. ఎగ్జయిట్ వేరియెంట్ ధర రూ.20.88 లక్షలు ఉండగా, ఎక్స్‌క్లూజివ్ వేరియెంట్ ధర రూ.23.58 లక్షలుగా ఉంది. ఇప్పటికే ఈ కార్లకు బుకింగ్స్‌ను నిలిపివేయగా, ముందుగా బుకింగ్ చేసుకున్న వారికి రూ.1 లక్ష తగ్గింపు ధరతో ఈ కార్లను విక్రయించనున్నారు. ఇక ప్రస్తుతానికి కేవలం ఢిల్లీ, ముంబై, అహ్మదాబాద్, బెంగళూరు, హైదరాబాద్ నగరవాసులకు మాత్రమే ఈ కారు అందుబాటులో ఉంది.

ఎంజీ మోటార్స్ జెడ్ఎస్ ఈవీ కారులో 44.5 కిలోవాట్ల కెపాసిటీ ఉన్న బ్యాటరీని ఏర్పాటు చేశారు. అందువల్ల ఈ బ్యాటరీని ఒక్కసారి చార్జింగ్ చేస్తే ఏకంగా 340 కిలోమీటర్ల దూరం వరకు వెళ్లవచ్చు. అలాగే కేవలం 40 నిమిషాల్లోనే ఈ బ్యాటరీ 80 శాతం వరకు చార్జింగ్ అవుతుంది. 8 సెకన్లలోనే 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగల పవర్‌ఫుల్ ఇంజిన్‌ను ఈ కారులో ఏర్పాటు చేశారు. ఇక ఈ కారు బ్యాటరీని ఎక్కడైనా చార్జింగ్ చేసుకునేందుకు వీలుగా 7.4 కిలోవాట్ల కెపాసిటీ కలిగిన చార్జర్‌ను ఎంజీ మోటార్స్ వినియోగదారులకు అందిస్తున్నది.

# క్యాంపస్‌లో రాజకీయాలకు తావు లేదు

### -ఐఐటి విద్యార్థులకు స్పష్టం చేసిన డైరెక్టర్

ముంబై,జనవరి23 (ఆర్ఎన్ఎ): బాంబే ఐఐటీ విద్యార్థులకు ఆ సంస్థ డైరెక్టరు సుభాషిస్ చౌదరి సంచలన ఆదేశాలు జారీ చేశారు. దేశంలోని పలు విద్యాసంస్థల్లో పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఆందోళనలు జరుపుతున్న నేపథ్యంలో బాంబే ఐఐటీ డైరెక్టర్ సుభాషిస్ చౌదరి ఒపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు హితబోధ చేశారు. రాజకీయాలపై విద్యార్థులు తమ వ్యక్తిగత అభిప్రాయాలను బాంబే ఐఐటీ క్యాంపస్ వెలుపల చేయాలని, ఐఐటీలో మాత్రం ఎలాంటి రాజకీయ వ్యాఖ్యలను అనుమతించనని డైరెక్టరు స్పష్టం చేశారు. బాంబే ఐఐటీకి కేంద్రప్రభుత్వం నిధులు ఇస్తున్నందువల్ల దీంతో విద్యార్థులు పరిశోధనలు చేసి సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకొని ప్రజలకు మేలు చేయాలని డైరెక్టరు కోరారు. ఐఐటీ రాజకీయాలకు అతీతంగా ఉండాలని, విద్యార్థులు ఇక్కడ చదువుతున్నంత కాలం విద్యాసంస్థ పక్షాన రాజకీయ వ్యాఖ్యలు ఎవరూ చేయవద్దని సుభాషిస్ చౌదరి కోరారు. కత్తి కంటే పెన్ను బలమైనదని, ఎవరైనా విద్యార్థులు రాజకీయంగా వ్యాఖ్యలు చేయాలంటే బయటకు వెళ్లి విద్యాసంస్థ పేరు ప్రస్తావించకుండా వారి అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించవచ్చని డైరెక్టరు స్పష్టం చేశారు. ప్రజలు చెల్లించే పన్నులతో కేంద్రం ఐఐటీకి నిధులు ఇస్తుందని, దీనివల్ల విద్యార్థులపై బాంబే ఐఐటీ ప్రతిష్ట పెంచే బాధ్యత ఉందని డైరెక్టరు గుర్తు చేశారు.

# సూపర్‌స్టార్ మహేష్ బాబు తన మెన్స్ వేర్ బ్రాండ్ 'ది హంబుల్ కం.'ను

### ఆన్‌లైన్ ఎమ్-కామర్స్ కంపెనీ అయిన మింత్రాలో ప్రారంభించారు




హైదరాబాద్, జనవరి 23 : సూపర్‌స్టార్ మహేష్ బాబు గత సంవత్సరంలో ప్రారంభించిన తన సొంత మెన్స్‌వేర్ బ్రాండ్ 'ది హంబుల్ కం.' ఇప్పుడు ఆన్‌లైన్ ఎమ్-కామర్స్ కంపెనీ మింత్రాలో అందుబాటులోకి తెచ్చినట్లుగా ఈ రోజున ప్రకటించింది. స్వెట్‌షర్ట్స్, హుడీస్, షర్ట్స్, టీ-షర్ట్స్ మరియు బాటమ్ వేర్ వంటి మహేష్ బాబు సినిమాలతో ప్రేరణ పొందిన బ్రాండ్‌కు చెందినటువంటి పలు రకాల ఎంపిక చేసిన కలెక్షన్ ఇప్పుడు ఆన్‌లైన్‌లో మింత్రా ద్వారా అందుబాటులోకి వచ్చాయి.

దక్షిణాదిలోనే అత్యంత ప్రజాదరణ పొందిన నటులలో ఒకరైన మరియు రాష్ట్రాల వ్యాప్తంగా లక్షలాది అభిమానుల ఫాలోయింగ్ కలిగిన మహేష్ బాబు స్ఫూర్తితో మార్కెట్‌లోకి ప్రవేశపెట్టిన 'ది హంబుల్ కం.' బ్రాండ్ తన ప్రత్యేకమైన స్టయిల్ కారణంగానే ప్రారంభం నుండే ఒక బలమైన వృద్ధిని సాధిస్తూ వస్తున్నది. ద్వితీయ మరియు తృతీయ శ్రేణికి చెందిన నగరాలు మరియు పట్టణాలలో బలమైన ఉనికి కలిగివున్న మింత్రాతో అనుబంధం ద్వారా ఇప్పుడు బ్రాండ్ తన పరిధిని మరింత విస్తృత పరుచుకోనున్నది.

మహేష్ బాబు యొక్క వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తూ క్యాజువల్ వేర్ బ్రాండ్ అన్ని వయస్సులకు చెందిన మగవారికి ఈజీ-టు-వేర్ స్టయిల్స్‌ను అందిస్తున్నది. క్యాజువల్ షర్ట్స్, క్యాప్స్, డెనిమ్, జాకెట్స్, చినోస్ మరియు టీ-షర్టులకు చెందిన 200లకు పైగా స్టయిల్స్‌ను రూ.599లతో మొదలుకుని సరసమైన ధరలతో అందిస్తున్నది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేష్ బాబు; 'ది హంబుల్ కం.' బ్రాండ్ హెడ్, సుశ్రితి కృష్ణ మరియు మింత్రా జబాంగ్, హెడ్, అమర్ నాగారాంలు హాజరైనారు. మహేష్ బాబు తన బ్రాండ్ గురించి మాట్లాడుతూ, " 'ది హంబుల్ కం.' దుస్తుల కలెక్షన్ తన వ్యక్తిగత స్టయిల్‌ను మరియు జీవన విధానాన్ని వ్యక్తీకరిస్తుందన్నారు. నేను విశ్వసించే నిరాడంబరత మరియు వినయం యొక్క విలువలే బ్రాండ్ యొక్క ప్రధానమైన రూపంగా ఉన్నాయి. 'ది హంబుల్ కం.' ద్వారా నా అభిమానులు వాస్తవికతతో జీవించేందుకు మరియు వినయంగా వుండేందుకు ప్రేరణను అందిస్తూ వారితో నాకున్న అనుబంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని కోరుకుంటున్నాను అన్నారు. కొద్దికాలం క్రితమే ప్రారంభమై అద్భుతంగా కొనసాగుతున్న ఈ బ్రాండ్ తన ప్రయాణంలో మింత్రాతో సహకారం అనేది ఒక ముఖ్యమైన ముందడుగుగా చెప్పవచ్చు అని మరియు బ్రాండ్ దేశవ్యాప్తంగా ఉన్న వస్త్రాభిమానులను చేరుకోవడంలో మార్గం మరింత సుగమం కానున్నది." అని ఆయన అన్నారు.

# నిజామాబాద్‌లో మాజీ సైనిక ఉద్యోగుల ర్యాలీ : డిఫెన్స్ పీఆర్వో

నిర్మల్,జనవరి23(ఆర్ఎన్ఎ): ఫిబ్రవరి 1న నిజామాబాద్ మారుతి నగర్ శ్రీరామ గార్డెన్స్ హాల్‌లో ఉదయం 8గంటల నుంచి దక్షిణ భారత్ ఏరియా తెలంగాణ ఆంధ్ర సబ్ ఏరియా, ఆర్డీలరీ సెంటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో మాజీ సైనికుల ఉద్యోగుల ర్యాలీని నిర్వహించనున్నట్లు డిఫెన్స్ పీఆర్వో బి.సతీశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు చెందిన ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్సు విభాగాలకు చెందిన మాజీ సైనిక ఉద్యోగులు పెద్ద సంఖ్య లో ఈ ర్యాలీలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా వీరనారీలను, దివ్యాంగ సైనికులను సన్మానించడం జరుగుతుందన్నారు. మెడికల్ క్యాంపుతో పాటు క్యాంటీ న్ సౌకర్యాలు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. మెడికల్ క్యాంపు, రికార్డు ఆఫీసులు, ఈసీహెచ్ఎ?సలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు

# కడపలో చంద్రబాబు దిష్టిబొమ్మ దగ్ధం

కడప, జనవరి23(ఆర్ఎన్ఎ): నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద వైసీపీ శ్రేణులు గురువారం ఆందోళనకు దిగారు. శాసనమండలిలో నిన్న జరిగిన ఘటనను నిరసిస్తూ చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం చేశారు. చంద్రబాబు రాయలసీమ ద్రోహి అంటూ నినాదాలు చేశారు. రాయలసీమ అభివృద్ధికి చంద్రబాబు అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. ఈ ఆందోళనలో మాజీ మేయర్ సురేష్ బాబు, ఇతర పార్టీ నేతలు పాల్గొన్నారు.

# భర్త మరణాన్ని తట్టుకోలేక...భార్య ఆత్మహత్య

చిత్తూరు, జనవరి23(ఆర్ఎన్ఎ): చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం అరగొండలో విషాదం చోటు చేసుకుంది. భర్త మరణాన్ని తట్టుకోలేక భార్య ఆత్మహత్య చేసుకుంది. షర్మిల అనే వివాహిత యాసిడ్ తాగి బలవన్మరణానికి పాల్పడింది. వెంటనే ఆమెను వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. షర్మిల భర్త దొరైరాజ్ గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో భర్త మరణాన్ని తట్టుకోలేక షర్మిల ఈ అఘాయిత్యానికి పాల్పడింది. షర్మిల యాదమర్రి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. దంపతుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

# మండలి ఛైర్మన్ షరీఫ్‌కు అభినందనల వెల్లువ

### చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన రాజధాని గ్రామాల రైతులు

అమరావతి,జనవరి23(ఆర్ఎన్ఎ): అధికారపక్ష దాడులను సమర్థంగా ఎదుర్కొని రాజధాని వికేంద్రీకరణ బిల్లును సెలెక్ట్ కమిటీకి సిఫార్సు చేసిన శాసనమండలి ఛైర్మన్ షరీఫ్‌కు రాజధాని రైతుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. రాజధాని గ్రామాల రైతు, ఐకాస నేతలు షరీఫ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

మంగళగిరి పాతబస్టాండ్ వద్ద మహ్మద్ షరీఫ్ ఫ్లెక్సీకి ఐకాస నేతలు, తుళ్లూరు, రాయపూడిలో షరీఫ్ చిత్రపటాలకు రైతులు పాలాభిషేకం నిర్వహించారు. తమ ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించిన శాసనమండలి ఛైర్మన్ చరిత్రపుటల్లో నిలిచిపోతారని రైతులు, ఐకాస నేతలు కొనియాడారు. మంత్రులు, వైకాపా నేతలు ఒత్తిడి తెచ్చినా ఎంతో ధైర్యంగా రైతుల పక్షాన నిలిచారని అభినందనలు తెలియజేశారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.